www.spiritdaily.com
RNI TG TEL/ 26/A0381

# సిరి
People's Voice వార్తపత్రిక

శనివారం
24-01-2026

సంపుటి (Volume) : 1
సంచిక (Issue) : 1

పేజీలు : 8 వెల : 4/-

Hyderabad, Warangal, Karimnagar

## ముగిసిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన - 2026

ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ రఘునందన్ రావు



3 లో

రామచంద్రపురం (సిరి న్యూస్ 23) : పోటీ ప్రపంచంలో రాణించాలంటే భాషా ప్రావీణ్యం, స్కిల్ డెవలప్మెంట్, సృజనాత్మకత అవసరమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా, కొల్లూరు లోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహించిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన-2026 ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ రఘునందన్ రావులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల వైజ్ఞానిక ఆవిష్కరణల స్టాళ్లను పరిశీలించి, వాటి ఉపయోగాలు, సాంకేతిక అంశాలను అడిగి తెలుసుకున్నారు.

### అన్యాక్రాంతం వెనుక

# అదృశ్య హస్తం ఎవరిది!?

## అధికారుల అండతోనే ప్రభుత్వ భూమికి ఎసరు

- క్షేత్రస్థాయిలో సీఎం ఆదేశాలకు తూట్లు
- ధరణిలో మాయాజాలం.. అధికారుల కనుసన్నల్లోనేనా?
- ప్రజావాణి ఫిర్యాదుకు పరిష్కారం ఏది?
- పేదవాడికి ఒక నీతి.. బడా కంపెనీకి మరో నీతి
- గ్రామ పంచాయతీ నోటీసులకు విలువేది?

2 లో



తెలంగాణలో ప్రభుత్వ భూములను అంగుళం కూడా వదిలిపెట్టవద్దని, కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే హెచ్చరిస్తున్నారు. కానీ మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రభుత్వ ఆస్తులకు కాపలా ఉండాల్సిన అధికారులే కబ్జాదారులకు 'రెడ్ కార్పెట్' పరుస్తున్నారా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. కామారం గ్రామంలోని ప్రభుత్వ సీలింగ్ భూమిని ఎస్.జి. స్నాక్స్ కంపెనీ మింగేస్తుంటే, జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న 'అదృశ్య హస్తం' ఎవరిది? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

(డి.జి. శ్రీనివాసశర్మ)
రామాయంపేట,(సిరిన్యూస్)



## నిర్మాణాలు ఆపకపోతే క్రిమినల్ చర్యలు!

సిరి ఎఫెక్ట్

సీలింగ్ భూమిని పరిశీలించిన తహసీల్దార్



## మోదీకి ఘన స్వాగతం

తిరువనంతపురంలో రోడ్‌షోలో వెల్లివిరిసిన ప్రజల ఉత్సాహం
నగర కార్పొరేషన్ ఫలితాల్లో ప్రతిబింబించిన విశ్వాసం
అభివృద్ధికి కట్టుబడి ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి

3 లో

అఖిల కేరళ ధీవర సభ ప్రతినిధులతో మోదీ భేటీ



## దావోస్ వేదికగా మాటల యుద్ధం

కెనడాకు ఇచ్చిన ఆహ్వానాన్ని వెనక్కి తీసుకున్న ట్రంప్

2 లో



## రాష్ట్రపతి భవన్‌లో 'గ్రంథ్ కుటీర్' ప్రారంభం

భారత సాంస్కృతిక-సాహిత్య వారసత్వానికి అద్దం పట్టే కేంద్రం

రాష్ట్రపతి భవన్‌లో 'గ్రంథ్ కుటీర్'ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా ప్రారంభించారు. భారతదేశంలోని 11 శాస్త్రీయ భాషల్లో ఉన్న అపారమైన హస్తప్రతులు, అరుదైన గ్రంథాల సమాహారంతో ఈ గ్రంథ్ కుటీర్‌ను అభివృద్ధి చేశారు.

2 లో

## కేరళ అసెంబ్లీ ఎన్నికలపై సమీక్ష

రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న భేటీ



2 లో

## ఏడు గంటల పాటు

# సుదీర్ఘ విచారణ

### కేటీఆర్ తొలి రోజు సిట్ విచారణ ముగింపు

జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి తెలంగాణ భవన్‌కు కేటీఆర్
2024లో నమోదైన కేసు నేపథ్యం

3 లో



**హైదరాబాద్, జనవరి 23 (సిరి న్యూస్ ప్రత్యేక ప్రతినిధి)**
ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు తొలి రోజు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు ఏడు గంటల పాటు కేటీఆర్‌ను విచారించారు. ఈ సందర్భంగా ఆయన వాంగ్మూలాన్ని సిట్ నమోదు చేసింది. విచారణ పూర్తైన అనంతరం కేటీఆర్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి నేరుగా తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. విచారణ సమయంలో పలు అంశాలపై అధికారులు

### సిట్ విచారణపై కేటీఆర్ సూటి ప్రశ్నలు

తప్పుడు లీకులు వ్యవస్థ వైఫల్యమా? కుట్రనా?

తనను విచారణ చేస్తున్న సిట్ అధికారులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు తీవ్రంగా ప్రశ్నించినట్టు సమాచారం.





## ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ విమర్శలు హాస్యాస్పదం

మహేశ్ కుమార్ గౌడ్
వ్యక్తిగత స్వేచ్ఛకు భంగమే అసలు విషయం
కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్‌పై విమర్శలు

3 లో

## సిట్ విచారణ రాజకీయ కక్ష

ప్రజలను డైవర్ట్ చేసే కుట్రలో భాగమే సిట్ విచారణ
ఎన్నికల ముందు సీట్ విచారణలు
ప్రభుత్వం చేస్తున్న స్కాములు బయట పెడుతున్నారు
ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

3 లో

## కోట్లాది భక్తుల రాకకు సమగ్ర ప్రణాళిక

మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర
రైలు—బస్ అనుసంధానంతో పకడ్బందీ ఏర్పాట్లు

### 28 ప్రత్యేక రైళ్లు — వరంగల్, కాజీపేట కేంద్రంగా సేవలు

3 లో

**హైదరాబాద్, జనవరి 23 (సిరి న్యూస్ ప్రత్యేక ప్రతినిధి)**
ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఈ నెల 28న ప్రారంభం కానుంది. కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది.





## శిరస్త్రాణమే శ్రీరామరక్ష

రోడ్డు భద్రత నియమాలు పాటించండి సురక్షితంగా గమ్యం చేరండి
అతివేగం ప్రమాదకరం, హెల్మెంట్ వాడకం మన ప్రాణాల్ని కాపాడుతుంది
మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు
ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



4 లో

## హైకోర్టు జడ్జితో సీనియర్ లాయర్ వాగ్వాదం

హైకోర్టు ధిక్కరణ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం!

- విద్యుత్ బిల్లు కేసే వాగ్వాదానికి కారణం.. న్యాయస్థానంలో ఉద్రిక్తత
- క్షమాపణలు చెబితే పరిగణనలోకి తీసుకోండి.. హైకోర్టుకు సుప్రీం సూచన



2 లో



3 లో

## మున్సిపోల్స్‌కు సర్వం సిద్ధం

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

### అన్యాక్రాంతం వెనుక

# అదృశ్య హస్తం ఎవరిది!?

## అధికారుల అండతోనే ప్రభుత్వ భూమికి ఎసరు



- క్షేత్రస్థాయిలో సీఎం ఆదేశాలకు తూట్లు
- ధరణిలో మాయాజాలం.. అధికారుల కనుసన్నల్లోనేనా?
- ప్రజావాణి ఫిర్యాదుకు పరిష్కారం ఏది?
- పేదవాడికి ఒక నీతి.. బడా కంపెనీకి మరో నీతి
- గ్రామ పంచాయతీ నోటీసులకు విలువేది?

**రామాయంపేట, జనవరి 23 (సిరి న్యూస్)** ప్రభుత్వ అవసరాలకు, పేద ప్రజల ఇళ్ల స్థలాలకు కేటాయించాల్సిన సీలింగ్ భూమి రాత్రికి రాత్రే ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లింది? అసలు అధికారులకు తెలియకుండా 'ధరణి' పోర్టల్‌లో మార్పులు జరగడం సాధ్యమేనా? కంపెనీ యాజమాన్యం ఏడాది కాలంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా, రెవెన్యూ యంత్రాంగం కనీసం అటువైపు చూడకపోవడం చూస్తుంటే.. కబ్జాదారులకు అధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని స్పష్టమవుతోంది.

### ప్రజావాణి ఫిర్యాదుకు పరిష్కారం ఏది?

జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరిగే ప్రజావాణిపై ప్రజలకు కొండంత ఆశ. కానీ కామారం గ్రామస్తుల విషయంలో అది నీటిమూటగానే మిగిలింది. మాజీ సర్పంచ్ పూలపల్లి యాదగిరి ఆధ్వర్యంలో గ్రామస్తులు జె.సి, ఆర్డీవో, కలెక్టర్‌కు స్వయంగా ఫిర్యాదు చేసినా, ఏడాది దాటినా అక్రమ నిర్మాణాలను కూల్చివేయకపోవడం గమనార్హం. కూల్చివేయడం అటు నుంచి నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతుండడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్యలు తీరుతాయని నమ్మాం.. కానీ కలెక్టర్ ఆఫీసు మెట్లు ఎక్కిన మాకు నిరాశే మిగిలింది. అధికారుల మౌనం కబ్జాదారులకు ధైర్యాన్ని ఇస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నోటీసులు ఇచ్చి.. చేతులు దులుపుకొని..

గ్రామ పంచాయతీ కార్యదర్శి సుహాసిని సదరు కంపెనీకి మూడుసార్లు నోటీసులు జారీ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ ఆ నోటీసులను కంపెనీ యాజమాన్యం చెత్తబుట్టలో వేసింది. రాత్రిపూట చీకటి మాటున యంత్రాలతో మట్టి నింపి, పనులను వేగవంతం చేస్తోంది. కేవలం నోటీసులు ఇచ్చి 'మమ' అనిపించడం వెనుక అధికారుల అసమర్థత ఉందా లేక మామూళ్ల మత్తు ఉందా? అనేది తేలాల్సి ఉంది.

### పేదవాడికి ఒక నీతి.. బడా కంపెనీకి మరో నీతి

ఒక పేదవాడు పూరిగుడిసె వేసుకుంటే జెసిబిలతో వచ్చే అధికారులు, వందల గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి భారీ షెడ్లు వేస్తున్న కంపెనీ వద్దకు వెళ్లడానికి ఎందుకు భయపడుతున్నారు?. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదనే కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేయడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటి? ప్రభుత్వ భూమిని కాపాడటంలో విఫలమైన చిన్నశంకరంపేట మండల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే స్పెషల్ టాస్క్ ఫోర్స్ రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ భూమి 'ప్రైవేట్ కంపెనీల' పరం కావడం ఖాయంగా కనిపిస్తోందని ఆ గ్రామ మాజీ సర్పంచ్ పూలపల్లి యాదగిరి తెలిపారు.



## నిర్మాణాలు ఆపకపోతే క్రిమినల్ చర్యలు !

### సీలింగ్ భూమిని పరిశీలించిన తహసిల్దార్

**రామాయంపేట, జనవరి 23(సిరిన్యూస్):** చిన్నశంకరంపేట మండల పరిధిలోని కామారం గ్రామంలో ఉన్న ఎస్ జి స్నాక్స్ కంపెనీ ప్రభుత్వ సీలింగ్ భూమిని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్న విషయం గురించి సిరి పత్రిక వరుస కథనాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గత ఏడాది కాలం నుండి కంపెనీ యజమాన్యం అత్యంత విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నిర్మాణం చేపడుతుండగా సిరి పత్రిక వెలుగులోకి తెచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో చిన్నశంకరంపేట మండల తహసిల్దార్ మాలతితో పాటు అధికారులు కామారం గ్రామానికి వెళ్లి అక్కడ ఉన్న ఎస్ జి స్నాక్స్ కంపెనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. కంపెనీ పక్కనే ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూములు యాజమాన్యం అక్రమ నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని వారు గుర్తించారు.. వెంటనే అక్రమ నిర్మాణాలు ఆపివేయాలని, లేనిపక్షంలో కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. రాత్రిపూట కంపెనీ యాజమాన్యం మట్టి తరలిస్తున్న విషయం తెలుసుకున్న అధికారులు ఇకముందు అలా జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది.



## అఖిల కేరళ ధీవర సభ ప్రతినిధులతో మోదీ భేటీ

**సిరి న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అఖిల కేరళ ధీవర సభ ప్రతినిధి బృందంతో సానుకూలంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్ర ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు. మత్స్యకారుల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో ఈ సంస్థ చేస్తున్న సేవలను మోదీ ప్రశంసించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం అఖిల కేరళ ధీవర సభ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అని మోదీ పేర్కొన్నారు. సముద్ర ఆధారిత జీవన విధానంపై ఆధారపడిన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. గత పది సంవత్సరాలుగా జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తోందని మోదీ వెల్లడించారు. మత్స్య ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు.రానున్న కాలంలో మరింత ఉత్సాహంతో మత్స్య రంగ అభివృద్ధికి చర్యలు కొనసాగిస్తామని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. మత్స్యకారుల ఆదాయం పెంచడం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మోదీ తెలిపారు.

## కేరళ అసెంబ్లీ ఎన్నికలపై సమీక్ష

### రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న భేటీ

కేరళలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కీలక సన్నాహక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే పాల్గొని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. సుమారు 3.6 కోట్ల మంది కేరళ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతో పాటు యూడీఎఫ్ భాగస్వామ్య పక్షాలు కలిసి ప్రగతిశీల, అభివృద్ధి ప్రధాన, సంక్షేమాధారిత పాలన అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, ఉపాధి కల్పన, సామాజిక న్యాయం, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. కేరళలో ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేసేలా క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని రాహుల్ గాంధీ సూచించినట్లు సమాచారం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ, యూడీఎఫ్ ప్రభుత్వమే కేరళకు స్థిరమైన, బాధ్యతాయుత పాలన అందించగలదని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ఆశయాలను ప్రతిబింబించే కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## హైకోర్టు జడ్జితో సీనియర్ లాయర్ వాగ్వాదం

**సిరి న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :** ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తితో జరిగిన వాగ్వాదానికి సంబంధించిన కోర్టు ధిక్కరణ వ్యవహారంలో సీనియర్ న్యాయవాది మహేశ్ తివారీపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. హైకోర్టు ఇచ్చిన ధిక్కార నోటీసులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. నన్నేం చేయగలరని హైకోర్టును పరోక్షంగా ప్రశ్నించేందుకే పిటిషన్ దాఖలు చేసినట్లు కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాలంటే చెప్పవచ్చని, లేకపోతే ధిక్కార ధోరణితో ముందుకు వస్తే తగిన విధంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అయితే న్యాయవాది క్షమాపణలు కోరితే వాటిని సహృదయంతో పరిగణించాలని ఝార్ఖండ్ హైకోర్టుకు సూచించారు. ఈ వివాదం ఓ విద్యుత్ బిల్లు కేసుతో ప్రారంభమైంది. ఝార్ఖండ్‌కు చెందిన ఓ మహిళకు 1.30 లక్షల మేర బకాయిలు ఉండటంతో అధికారులు విద్యుత్ కనెక్షన్ నిలిపివేశారు. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరగా మహిళ తరపున మహేశ్ తివారీ వాదనలు వినిపించారు. కనెక్షన్ పునరుద్ధరణ కోసం 25 వేలు చెల్లించేందుకు సిద్ధమని ఆయన కోర్టుకు తెలియజేశారు. అయితే గత తీర్పుల ప్రకారం కనీసం బకాయిలో సగం మొత్తాన్ని చెల్లించాల్సిందేనని న్యాయమూర్తి పేర్కొన్నారు. చివరకు 50 వేలు చెల్లించేందుకు అంగీకరించడంతో విషయం ఒక దశలో సర్దుబాటు అయ్యింది. అయితే వాదనలు వినిపించిన తీరు నచ్చకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. బార్ కౌన్సిల్ ఛైర్మన్‌కు ఈ అంశంపై దృష్టి పెట్టాలని సూచించడంతో మహేశ్ తివారీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తాను తన శైలిలోనే వాదనలు వినిపిస్తానని, ఎవరూ తనను అవమానించేలా వ్యాఖ్యలు చేయొద్దని స్పష్టం చేశారు. కోర్టు అన్యాయం చేస్తోందని మీరు అంటున్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించగా, తాను అలా అనలేదని మహేశ్ వివరణ ఇచ్చారు. అవసరమైతే విచారణ రికార్డును పరిశీలించాలని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం మహేశ్ తివారీకి కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.



## రాష్ట్రపతి భవన్ లో 'గ్రంథ్ కుటీర్' ప్రారంభం

### భారత సాంస్కృతిక–సాహిత్య వారసత్వానికి అద్దం పట్టే కేంద్రం

**సిరి న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :** రాష్ట్రపతి భవన్‌లో 'గ్రంథ్ కుటీర్'ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా ప్రారంభించారు. భారతదేశంలోని 11 శాస్త్రీయ భాషల్లో ఉన్న అపారమైన హస్తప్రతులు, అరుదైన గ్రంథాల సమాహారంతో ఈ గ్రంథ్ కుటీర్‌ను అభివృద్ధి చేశారు. దేశ పౌరుల్లో భారతదేశానికి చెందిన సమృద్ధమైన సాంస్కృతిక, సాహిత్య వారసత్వంపై అవగాహన పెంపొందించడమే గ్రంథ్ కుటీర్ లక్ష్యమని ఈ సందర్భంగా రాష్ట్రపతి తెలిపారు. తరతరాలుగా శాస్త్రీయ భాషల్లో సేకరించిన జ్ఞాన సంపద మన చరిత్ర గొప్పతనాన్ని చాటుతోందని ఆమె పేర్కొన్నారు. శాస్త్రీయ భాషల్లో దాగి ఉన్న జ్ఞానం మనకు గతం నుంచి పాఠాలు నేర్పుతూ, భవిష్యత్తును వెలుగుతో నింపే దిశగా ప్రేరణనిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ జ్ఞాన వారసత్వాన్ని పరిరక్షిస్తూ, కొత్త తరాలకు చేరవేయడం అత్యంత అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. గ్రంథ్ కుటీర్ ప్రారంభం భారత జ్ఞాన సంప్రదాయాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు, సాహిత్య ప్రియులకు ఈ కేంద్రం ఒక విలువైన జ్ఞాన భాండాగారంగా నిలవనుందని వారు పేర్కొన్నారు.

## దావోస్ వేదికగా మాటల యుద్ధం

**సిరి న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :** ప్రపంచ ఆర్థిక వేదికగా పేరుగాంచిన దావోస్ సమావేశాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. గాజా శాంతి మండలిలో చేరాలంటూ కెనడాకు పంపిన ఆహ్వానాన్ని ఆయన అకస్మాత్తుగా వెనక్కి తీసుకున్నారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. గాజా శాంతి మండలి ప్రతిష్ఠాత్మకమైన వేదిక అని పేర్కొన్న ఆయన, కెనడా ప్రధాని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.దావోస్ సమావేశాల్లో కెనడా ప్రధాని మార్క్ కార్నీ అమెరికా గ్రీన్‌లాండ్ సుంకాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బలమైన దేశాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటున్నాయని విమర్శించారు. ఒకప్పుడు దేశాల మధ్య భాగస్వామ్య ఒప్పందాలు పరస్పర అభివృద్ధికి ఉపయోగపడేవని, ఇప్పుడు అవే ఆయుధాలుగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రపంచం సమైక్యత వైపు కాకుండా విభజన దిశగా వెళ్తోందని కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలతో అసంతృప్తి చెందిన ట్రంప్ కెనడాకు ఇచ్చిన ఆహ్వానాన్ని రద్దు చేశారు. అంతర్జాతీయ వాణిజ్య నియమాలను ఇష్టానుసారంగా అమలు చేస్తున్నారని కార్నీ చేసిన వ్యాఖ్యలు అమెరికా వైఖరిపై ప్రత్యక్ష విమర్శగా మారాయి. దీంతో ఇరు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రపంచ రాజకీయాల్లో ఈ పరిణామం కొత్త చర్చలకు దారితీస్తోంది.



## నర్సాపూర్ బీజేపీకి భారీ షాక్!

- పార్టీని వీడిన నాయకులు, కార్యకర్తలు

**నర్సాపూర్, జనవరి 23(సిరిన్యూస్):** నర్సాపూర్ బీజేపీ పార్టీకి భారీగా షాక్ తగిలింది. పార్టీలో కొందరి పెత్తనం కారణంగా ఇమడలేక పోతున్నామని ఆరోపిస్తూ పార్టీని వీడుతున్నట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు వాల్‌దాస్ మల్లేశ్ గౌడ్, నర్సాపూర్ పట్టణ అధ్యక్షుడు నీరుడి చంద్రయ్యకు రాజనీమా లేఖ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ రాజకీయం పార్టీ చేతులో లేదని, కొంతమంది వ్యక్తుల చేతులలోకి వెళ్ళిపోయిందన్నారు. ఇక్కడ నిజంగా పార్టీ కోసం కష్టపడే వ్యక్తులకు, నాయకులకు, కార్యకర్తలకు సరైన అవకాశం గుర్తింపు లేదన్నారు. పార్టీ కోసం ఎంత కష్టపడుతున్నా వారి జీవితాలను చించి వేయాలని కొంత మంది దృష్ట శక్తులు అడ్డుపడుతున్నాయని వాపోయారు. మేము నర్సాపూర్ భారతీయ జనతా పార్టీ ఖరాబ్ అయిందని, మేము అందులో నీతి నిజాయితో ఉన్నా లాభం లేకుండా ఉందని వాపోయారు. కాగా పార్టీ వీడిన వారిలో డి. మహేందర్ గౌడ్, డి.మారెన్ ది డాలీ, బుడ్డ ప్రశాంత్, వడ్డె శివ, జి.శ్రీధర్, పి.శ్యామ్, పన్యాల ప్రదీప్, జి.సతీష్, గణేష్, మాధవ్, స్వామి, గొల్ల రాజు, డి. శావ్య, ప్రదీప్, భోం ప్రసాద్, ఎస్. బార్నీ ఉన్నారు.

# మోదీకి ఘన స్వాగతం

**సిరి న్యూస్, హైదరాబాద్ :** తిరువనంతపురం నగరానికి చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రజల నుంచి ఉత్సాహభరిత స్వాగతం లభించింది. నగరంలో నిర్వహించిన రోడ్‌షో సందర్భంగా రహదారుల వెంట పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ ఆత్మీయతను, మద్దతును వ్యక్తం చేశారు. నగరమంతా కనిపించిన ఉత్సాహం రాజకీయంగా విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. రోడ్‌షోలో ప్రజల్లో కనిపించిన స్పందన భారతీయ జనతా పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి స్పష్టమైన సంకేతమని మోదీ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన నగర కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో ప్రజల తీర్పు ఇదే విషయాన్ని మరింత బలంగా చాటిచెప్పిందని ఆయన అభిప్రాయపడ్డారు. తిరువనంతపురం నగర అభివృద్ధిపై ప్రజలు పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలు ఈ స్వాగతంలో స్పష్టంగా కనిపించాయని మోదీ తెలిపారు. మెరుగైన పౌర సదుపాయాలు, పారదర్శక పాలన, ప్రజలకు చేరువైన సేవలు కావాలనే సంకల్పమే ఈ విశ్వాసానికి కారణమని అన్నారు. ప్రజల ఆశీస్సులతో జాతీయ ప్రజాస్వామ్య కూటమి తిరువనంతపురం నగరానికి అభివృద్ధి, మెరుగైన పౌర సేవలు, భవిష్యత్తు అందించేందుకు పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. నగరాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించడమే తమ లక్ష్యమని ఆయన వెల్లడించారు.

# మున్సిపోల్స్‌కు సర్వం సిద్ధం

**మెదక్, జనవరి 23(సిరిన్యూస్) :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లాలోని మెదక్,నర్సాపూర్ తూప్రాన్, రామాయంపేట , మున్సిపాలిటీలలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మల్కాజిగిరి ,వికారాబాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మెదక్ కలెక్టరేట్ కార్యాలయం నుండి కలెక్టర్ పాల్గొన్నారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు తెలిపారు. ఓటర్ జాబితా,పోలింగ్ కేంద్రాల జాబితా మ్యాపింగ్ చేసి ప్రచురించడం జరిగిందని తెలిపారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఒక రౌండ్ పరిశీలించినట్లు తెలిపారు.ఆర్.ఓ ఏ.ఆర్.ఓ ల ను గుర్తించడం జరిగిందని తెలిపారు..పోలింగ్ నిర్వహణకు సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు.బ్యాలెట్ బాక్స్ లు సిద్ధంగా ఉన్నట్లు,పోలింగ్ కేంద్రాల్లోవెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు.కౌంటింగ్ నిర్వహణకు భవనాలను పరిశీలించినట్లు తెలిపారు.జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్,ఎస్.ఎస్.టి బృందాల కు మెజిస్టీరియల్ అధికారాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్ , మున్సిపల్ కమిషనర్స్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతిలో చేరిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

**మనోహరాబాద్, జనవరి 23 సిరి న్యూస్) :** సిద్ధిపేట నియోజకవర్గానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్. శ్రీనివాస్ నేతృత్వంలో మిట్టపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు ఉద్యమకారులు తెలంగాణ జాగృతిలో చేరారు. హైదరాబాద్‌లోని జాగృతి ప్రధాన కార్యాలయంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగా చేరిన నేతలకు కండువాలు కప్పి ఆహ్వానించారు. తెలంగాణ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సాంస్కృతిక పరిరక్షణ లక్ష్యాలతో జాగృతి చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై తాము చేరుతున్నామని కొత్త సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాట్లాడిన కవిత, గ్రామస్థాయి నుంచి ఉద్యమకారులు జాగృతిలో భాగమవడం సంస్థ బలాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం, మహిళా సాధికారత, తెలంగాణ సంస్కృతి పరిరక్షణ దిశగా జాగృతి కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు జాగృతి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ చేరికలతో సిద్ధిపేట ప్రాంతంలో తెలంగాణ జాగృతి కార్యకలాపాలు మరింత బలోపేతం కానున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# కోట్లాది భక్తుల రాకకు సమగ్ర ప్రణాళిక

**మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర**

**రైలు–బస్ అనుసంధానంతో పకడ్బందీ ఏర్పాట్లు**

**28 ప్రత్యేక రైళ్లు – వరంగల్, కాజీపేట కేంద్రంగా సేవలు**

**సిరి న్యూస్, హైదరాబాద్ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఈ నెల 28న ప్రారంభం కానుంది. కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. రవాణా విషయంలో దక్షిణ మధ్య రైల్వే మరియు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే మొత్తం 28 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. మేడారానికి నేరుగా రైలు మార్గం లేకపోవడంతో సమీప ప్రధాన స్టేషన్లైన వరంగల్, కాజీపేటలకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఈ నెల 28, 29 తేదీల్లో సికింద్రాబాద్-మంచిర్యాల-సిర్పూర్ కాగజ్‌నగర్, నిజామాబాద్-వరంగల్, కాజీపేట-ఖమ్మం, ఆదిలాబాద్ వంటి మార్గాల్లో ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. దీని వల్ల హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణం మరింత సులభమవుతుంది.





### స్టేషన్ నుంచే నేరుగా గద్దెలకు బస్సులు

రైళ్ల ద్వారా వరంగల్, కాజీపేట స్టేషన్లకు చేరుకున్న భక్తులు నేరుగా మేడారం గద్దెల వద్దకు వెళ్లేందుకు టీజీఎస్‌ఆర్‌టీసీ భారీగా బస్సులను సిద్ధం చేసింది. రైల్వే స్టేషన్ల ప్రాంగణాల్లోనే ప్రత్యేక బస్ పాయింట్లు ఏర్పాటు చేసి నిరంతరాయంగా సర్వీసులు నడుపుతారు. రైలు దిగిన వెంటనే బస్సు అందుబాటులో ఉండేలా రైల్వే-ఆర్టీసీ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఈ రవాణా సౌకర్యాలు జాతర ముగిసే జనవరి 31 వరకు కొనసాగుతాయి.

### హెలికాప్టర్ సేవలు – ఈసారి ప్రత్యేక ఆకర్షణ

ఈసారి ప్రత్యేక ఆకర్షణగా హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రానుపోను ప్రయాణానికి సుమారు రూ.35,999 ఖర్చవుతుందని నిర్వాహకులు తెలిపారు. సొంత వాహనాలు లేనివారు లేదా ప్రైవేట్ వాహనాల అధిక ఛార్జీల నుంచి తప్పించుకోవాలనుకునే భక్తులకు రైలు-బస్ అనుసంధానం గొప్ప అవకాశం. ఈ ఏర్పాట్లతో భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా వనదేవతల దర్శనం చేసుకోగలరని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ముగిసిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన-2026

- **ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ రఘునందన్ రావు**



**రామచంద్రపురం (సిరి న్యూస్ 23) :** పోటీ ప్రపంచంలో రాణించాలంటే భాషా ప్రావీణ్యం, స్కిల్ డెవలప్మెంట్, సృజనాత్మకత అవసరమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా, కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహించిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన-2026 ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ రఘునందన్ రావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల వైజ్ఞానిక ఆవిష్కరణల స్టాళ్లను పరిశీలించి, వాటి ఉపయోగాలు,సాంకేతిక అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి ఆలోచనా విధానం, సృజనాత్మకతను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రాథమిక విద్య నుంచి ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తూ విద్యా రంగాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో కూడిన క్వాలిటీ ఎడ్యుకేషన్, అలాగే మెరుగైన వైద్య సేవలను సామాన్యులకు ఉచితంగా అందించడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలోనే 90 శాతం వైద్య చికిత్సలు అందేలా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, సూపర్ స్పెషాలిటీ సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజా వైద్యాన్ని పటిష్టం చేస్తున్నామని తెలిపారు. నర్సింగ్ వృత్తిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తోందని, నర్సింగ్ విద్యార్థులు విదేశాల్లో సేవలందించేందుకు జపనీస్, జర్మన్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తున్నామని మంత్రి వివరించారు.విద్యార్థులు సృజనాత్మకత, స్కిల్, క్వాలిటీ, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, ఐక్యూ స్థాయిని పెంచుతాయని అన్నారు.ఈ ప్రదర్శనలో అద్భుతమైన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు మంత్రి నగదు బహుమతులు, షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజి రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ నికోలస్, ఎస్సిఆర్టి డైరెక్టర్ రమేష్, అదనపు కలెక్టర్ పాండు, గాడియం స్కూల్ సీఈఓ రామకృష్ణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు భద్రతపై కార్మికులకు, అవగాహన

**రోడ్డు భద్రత వారోత్సవాల్లో అలైవ్ అరైవ్ కార్యక్రమం అవగాహన**

**పరిశ్రమల ప్రాంతాల్లో రోడ్డు భద్రతకు గురించి కార్మికులు, డ్రైవర్లకు అవగాహన**

**ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి**




**మనోహరాబాద్, జనవరి 23 సిరి న్యూస్) :** రోడ్డు ప్రమాదాలు ఒక్క కుటుంబానికే కాదు, సమాజానికే తీరని నష్టం కలిగిస్తాయని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "అరైవ్-అలైవ్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 8వ రోజు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని అన్నారు. వాహనాలను వేగంగా నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంలో నిర్లక్ష్యం వంటి కారణాల వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కార్మికులు విధులు ముగించుకుని సురక్షితంగా ఇంటికి చేరడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించడమే లక్ష్యంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు ఉద్యోగం ఎంత ముఖ్యమో ఆ ఉద్యోగి ప్రాణం అంతకన్నా విలువైనది. వేగం కాదు జీవితం గెలవాలని అన్నారు. మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐటిసి కంపెనీలో రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాస్ ఆదేశానుసారం మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐటిసి కంపెనీలో భారీ ఎత్తున రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ . ఎస్ మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ . శ్రీ ఎస్ మహేందర్ మాట్లాడుతూ, వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మోటార్ సైకిళ్ల ద్వారానే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకుంటే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. అందువల్ల రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చిన్న వయస్సు నుంచే బాధ్యతగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్ మాత్రమే వినియోగించాలని, హెల్మెట్ స్ట్రాప్‌ను తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు. హెల్మెట్ స్ట్రాప్ పెట్టుకోనట్లయితే హెల్మెట్‌కు ఎలాంటి రక్షణ ప్రయోజనం ఉండదని చెప్పారు. అలాగే సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని, వేగ నియంత్రణ పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని, తమ తల్లిదండ్రులు బయటకు వెళ్లే సమయంలో కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించాలన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి. నరేందర్ గౌడ్, తూప్రాన్ సీఐ. రంగకృష్ణ, మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్, పరిశ్రమ యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.

# ఏడు గంటల పాటు సుదీర్ఘ విచారణ

**కేటీఆర్ తొలి రోజు సిట్ విచారణ ముగింపు**

**జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి తెలంగాణ భవన్‌కు కేటీఆర్**

**2024లో నమోదైన కేసు నేపథ్యం**

**సిరి న్యూస్, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు తొలి రోజు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు ఏడు గంటల పాటు కేటీఆర్‌ను విచారించారు. ఈ సందర్భంగా ఆయన వాంగ్మూలాన్ని సిట్ నమోదు చేసింది. విచారణ పూర్తైన అనంతరం కేటీఆర్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి నేరుగా తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. విచారణ సమయంలో పలు అంశాలపై అధికారులు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కేటీఆర్ పూర్తి స్థాయిలో సహకరించినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలతో 2024 మార్చిలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. అప్పటి నుంచి ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### సజ్జనార్ నేతృత్వంలో సిట్ దర్యాప్తు

ఈ కేసును ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. కేసు దర్యాప్తులో భాగంగానే కేటీఆర్‌ను తాజాగా సిట్ ప్రశ్నించింది. అవసరమైతే తదుపరి దశలో మరిన్ని విచారణలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు సూచించారు.

### సిట్ విచారణపై కేటీఆర్ సూటి ప్రశ్నలు

తనను విచారణ చేస్తున్న సిట్ అధికారులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు తీవ్రంగా ప్రశ్నించినట్టు సమాచారం. తాను గానీ, తమ పార్టీ నాయకులు గానీ విచారణకు హాజరవుతున్న ప్రతిసారి బయటకు తప్పుడు సమాచారం ఎలా వెళ్తోందని ఆయన నిలదీశారు. విచారణ జరుగుతున్న సమయంలో ఎవరి అనుమతితో ఇష్టానుసారంగా లీకులు ఇస్తున్నారని పోలీసు అధికారులను కేటీఆర్ ప్రశ్నించారు. విచారణ గదిలో అసలు జరగని విషయాలు కూడా మీడియా స్టూడియోలకు చేరుతున్నాయంటే, ఇది వ్యవస్థ వైఫల్యమా లేక ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రనా అని ఆయన సూటిగా అడిగినట్టు తెలుస్తోంది. సిట్ విచారణ అనేది చట్టబద్ధమైన, బాధ్యతాయుతమైన ప్రక్రియ అని గుర్తు చేసిన కేటీఆర్, ఇలాంటి చీప్ లీకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని మండిపడ్డారు. దర్యాప్తు పేరుతో రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థను దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యానించినట్టు సమాచారం. నిజంగా న్యాయం చేయాలనుకుంటే ముందు ఈ తప్పుడు లీకులను నిలిపివేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాజకీయ ప్రతీకారం కోసమే ఇలాంటి చర్యలు చేపడితే ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. పోలీసులు ప్రభుత్వానికి కాదు, రాజ్యాంగానికి విధేయులని గుర్తుంచుకోవాలని సిట్ అధికారులకు కేటీఆర్ స్పష్టం చేసినట్టు సమాచారం.

# ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ విమర్శలు హాస్యాస్పదం

**సిరి న్యూస్, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు చేస్తున్న విమర్శలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. ఈ రోజు మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత హననం జరుగుతోందని కేటీఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని, రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. కేటీఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా తీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని అన్నారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబం అలీబాబా-420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ స్టువర్టుపురం దొంగల బ్యాచ్‌లా మారిందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోవాలని సెటైర్లు వేశారు. తోడబుట్టిన చెల్లెలు కల్వకుంట్ల కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతున్నప్పటికీ ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. కవితను తాను చెల్లెలుగానే గౌరవిస్తానని, ఆమె నిజాలు మాట్లాడుతున్నందుకు స్వాగతిస్తున్నామని అన్నారు. కేసీఆర్ కుటుంబంలో తగాదాలకు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు.

### భద్రతా ప్రశ్నలు, ఇతర డిమాండ్లు

దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని, అలాంటప్పుడు సినిమా వాళ్ల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. సినీ తారల ఫోన్లు ట్యాప్ చేయడం వెనుక ఉద్దేశం ఏంటని నిలదీశారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కాళేశ్వరం అవినీతిపై కె. చంద్రశేఖర్ రావు కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని *బండి సంజయ్*ను నేరుగా ప్రశ్నిస్తున్నానని, అలాగే బీజేపీ నేతలపై ఉన్న ఈడీ కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని, తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని ఆరోపించారు.

# సిట్ విచారణ రాజకీయ కక్ష

**నర్సాపూర్ జనవరి 23 (సిరి న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేయడం చేతగాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగిసే వరకు ప్రజలను డైవర్ట్ చేసే కుట్రలో భాగమే సిట్ నోటీసులు అని బీఆర్ఎస్ పార్టీని బదలాం చేయడానికి మాత్రమే అన్నారు.. బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నించే గొంతుక అని హరీష్ రావు కేటీఆర్ పైన రాజకీయం కక్ష్యలో భాగంగానే ట్రాన్స్కో కాలేశ్వరం ప్రాజెక్ట్ కార్ రేసింగ్ ఫోన్ ట్యాపింగ్ అంశాలపై సిట్ విచారణ చేస్తుందని ఆరోపించారు హరీష్‌రావు బొగ్గు స్కాములు మాట్లాడితే 24 గంటలు నోటీసులు పంపించారు కనీసం ఇంటిమేషన్ కూడా ఇవ్వలేదని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సివిల్ సప్లై ,ల్యాండ్, బొగ్గు గనుల స్కాముల పైన సిట్ అధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు .. రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందని హామీలను గాలికి వదిలేసింది అన్నారు.. గ్రామ పంచాయతీ ఎన్నికల తరహాలో, మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తాం అన్నారు.

# నేతాజీ ఆశయాలు యువతకు మార్గదర్శకం కావాలి

- నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల రూరల్ , జనవరి 23 ( సిరి న్యూస్) :** మున్సిపాలిటీ కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్ హాజరై సుభాష్ చంద్ర బోస్ విగ్రహానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడు తూ సుభాష్ చంద్రబోస్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో స్వాతంత్ర సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అనిర్వచనీయమైందన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హిందూ ఫోర్స్ స్థాపించి బ్రిటిష్ గుండెల్లో రైలు పరిగెత్తేలా చేసిన మహనీయుడు అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి నాకు రక్తం ఇవ్వండి, మీకు స్వాతంత్ర్యం ఇస్తాను అనే నినాదంతో కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించిన మహానుభావుడు సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. ఆయన ఆశయాలు సిద్ధాంతాలు నేటి యువతకు మార్గదర్శకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంద భాస్కర్ రెడ్డి కొండల్ రెడ్డి మొగులయ్య సందీప్ గౌడ్ శ్రీనివాస్ రెడ్డి సత్యనారాయణ సూర్యనారాయణ భాస్కర్ మోహన్ నర్సింలు ఆంజనేయులు రవి కాంత్ రెడ్డి సుధాకర్ రెడ్డి యాదాకిషన్ సత్యనారాయణ చారి దామోదర్



చారి కుమార్ గౌడ్ శంకర్ మురళి దీపక్ యువకులు పాల్గొన్నారు.

# గడ్డపోతారంలో ఘనంగా నేతాజీ జయంతి



**జిన్నారం జనవరి 23 (సిరి న్యూస్) :** జిన్నారం :గడ్డపోతారం మున్సిపాలిటీ భారత స్వాతంత్ర్య పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని బిజెపి గడ్డపోతారం మున్సిపల్ కన్వీనర్ మద్దూరి రాజు ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించడం జరిగింది. నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మద్దూరి లక్ష్మణ్ రావు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మద్దూరి మాణిక్యం, శక్తి కేంద్రం ఇంచార్జ్: మద్దూరి పటేల్ బాలయ్య మరియు ముఖ్య కార్యకర్తలు: అగ్రారం వెంకటేష్, ఎం. మహేష్ బూత్ అధ్యక్షులు అగ్రారం శంకర్, మాజీ వార్డ్ సభ్యులు నరబోయిన నర్సింగ్ రావు, నారాబోయిన ఓంకార్, శివ, ఎం.పి. చక్రపాణి, జ్ఞానేధర్ సునీల్, ఆశన్నల శ్రీనివాస్ తదితర బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## గణతంత్ర దినోత్సవ వేడుకలపై సమీక్ష

- సమీక్షలో పాల్గొన్న సిద్దిపేట జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్

**సిద్దిపేట జనవరి 23 (సిరి న్యూస్) :** ఈ నెల 26 వ తేదీన జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఐడిఓసి సమావేశ మందిరంలో పోలీస్ కమీషనర్ సాధన రష్మీ పెరుమాల్ తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవనం, సహకార, వైద్య ఆరోగ్యం, పోలీస్, ఫైర్, ఆర్టీసీ, ఫారెస్ట్, విద్యుత్, హౌసింగ్ తదితర 12 శాఖల శకటాలు, చేనేత, ఎస్సీ, బీసీ, ఎస్టీ కార్పొరేషన్లు, సంక్షేమ శాఖ, బ్యాంకర్స్, ఇరిగేషన్, మార్కెటింగ్, లేబర్, మిషన్ భగీరథ, సాంఘిక సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ తదితర 15 శాఖల స్టాళ్ల ఏర్పాట్లను కమిషనర్ పోలీస్ కార్యాలయం ఆవరణలో సిద్ధం చేయాలనీ అలాగే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే సంస్కృతిక కార్యక్రమాలు, కార్యక్రమానికి వచ్చే అతిథులకు, విద్యార్థులకు, ప్రజలకు, ఉద్యోగులకు అందరికీ ఇబ్బంది కలగకుండా షామియానా, త్రాగునీరు వసతి, నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక మూవబుల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ను పోలీస్ కమీషనర్ తో కలిసి సందర్శించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఆర్డిఓ సదానందం, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## ఉపాధి హామీ చట్టం పేరు మార్పు కుట్ర

- పేదల హక్కులపై కేంద్ర ప్రభుత్వ దాడి
- ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్



**గజ్వేల్ జనవరి 23 (సిరి న్యూస్) :** ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం సరికాదని, మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా చారిత్రాత్మక ఉపాధి చట్టాన్ని బలహీనపరచే ప్రయత్నం జరుగుతోందని ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్,సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి,గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూం కుంట నర్సారెడ్డి,తీవ్రంగా విమర్శించారు. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గ్రామీణ పేదల చెమటతో నడిచే ఉపాధి హామీ చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం గాంధీజీకి మాత్రమే కాదు, దేశంలోని కోట్లాది గ్రామీణ పేదలకు చేసిన ఘోర అవమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు.వికసిత్ భారత్ రోజ్‌గార్ మరియు అజీవికా మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం, బకాయిలు పెంచడం, పనిదినాల్లో కోతలు విధించడం ద్వారా గ్రామీణ ఉపాధి హక్కును కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందని ఆరోపించారు.ఉపాధి హామీ చట్టం పేదలకు భరోసా కల్పించిన చారిత్రాత్మక చట్టమని, దానిని నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. పేదల కూలి హక్కుల కోసం చివరి వరకూ పోరాటం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో. గ్రామ సర్పంచ్ కొయ్యడ వెంకటేశం,ఏఎంసి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మరియు కొండపాక, కుకునూర్ పల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




- దేశభక్తి, క్రమశిక్షణ యువతకు మార్గదర్శకం
- సిద్దిపేట నగర కార్యదర్శి పరశురామ్

**సిద్దిపేట జనవరి 23 (సిరి న్యూస్) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాల వేసి వారిని స్మరించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా సిద్దిపేట నగర కార్యదర్శి పరశురామ్ మాట్లాడుతూ నేతాజీ భారత స్వతంత్ర ఉద్యమంలో ముఖ్యమైన పాత్ర పోషించిన మహానుభావులని మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్రం ఇస్తాను అని యువతకు స్ఫూర్తినిచ్చి ఆజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించి సైన్యంతో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి జైలు జీవితం అనుభవించిన దేశభక్తుడని ఇలాంటి వారిని మనం ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.సునీత , విభాగాధిపతులు డా.గోపాల సుదర్శనం , డా.హరిబాబు , సుమలత ,సర్దార్ వల్ల భాయ్ పటేల్ జోనల్ ఇంచార్జ్ శ్రావణ్,కార్తీక్, ప్రశాంత్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

## 8 ప్రతిష్టాత్మక ప్రోకామ్ స్లామ్ మెడల్స్ సాధించిన కానిస్టేబుళ్లు



**గజ్వేల్ జనవరి 23 (సిరి న్యూస్) :** ఒకే క్యాలెండరు సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన నాలుగు మెట్రోపాలిటన్ ప్రాంతాలు అనగా ముంబై, ఢిల్లీ, కోల్ కతా, బెంగళూరు నగరాల మారథాన్‌లను నిర్ణిత సమయంకంటే ముందే విజయవంతంగా పూర్తి చేసి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ప్రోకామ్ స్లామ్' లో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 8 మంది కానిస్టేబుళ్లు ఎం. రాజీ రెడ్డి (ఐటీ సెల్ ) ఎ హరికృష్ణ (ఐటీ సెల్) పి రమేష్ (ఐటీ సెల్) జి అశోక్, సిద్దిపేట ట్రాఫిక్ ఈ భానుచందర్ ఎ ఆర్ కానిస్టేబుల్ కె జగదీష్ ఎ ఆర్ కానిస్టేబుల్ కె. రమేష్ తోగుట పోలీస్ స్టేషన్ ఎస్ గోపాల్, సిద్దిపేట ట్రాఫిక్ వీరు అద్భుత ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించిన సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్ రష్మీ పెరుమాళ్ అభినందనలు తెలిపి మాట్లాడుతూ పోలీస్ విధుల్లో ఉంటూ, అత్యంత కఠినమైన ఈ మారథాన్‌ల కోసం శిక్షణ పొంది, నాలుగు నగరాల్లో పతకాలు సాధించడం గర్వకారణమని. ఇది వారి క్రమశిక్షణకు శారీరక ధృడత్వానికి నిదర్శనం. వీరి విజయం తోటి సిబ్బందికి యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు..

## సరస్వతి దేవి ఆలయంలో వసంత పంచమి వేడుకలు





**జహీరాబాద్ జనవరి 23 (సిరి న్యూస్) :** జహీరాబాద్ పట్టణంలోని దత్త గిరి కాలనీలో గల సరస్వతి దేవి ఆలయంలో వసంత పంచమి వేడుకలను ఆలయ నిర్వాహకులు శంకర్ జోషి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుండే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పుష్పార్చనాలు,అభిషేకాలు,కుంకుమార్చనలు చేసి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మదినం కావున దేవాలయం వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్న ప్రాసనలు తల్లిదండ్రులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో పలువురు మహిళా భక్తులు లలిత సహస్ర నామాలను స్తోత్రం చేశారు.ఇక ఈ ఆలయం పట్టణం నడిబొడ్డున ఉండటం తో పట్టణంలోని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఇక ఆలయానికి వచ్చిన భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను,అన్న ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందజేశారు.



## వసంత పంచమి సామూహిక అక్షరాభ్యాసాలు

**గుమ్మడిదల రూరల్ , జనవరి 23 ( సిరి న్యూస్) :** వసంత పంచమి పురస్కరించుకుని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఆవరణంలో వసంత పంచమి వేడుకలను మైత్రి ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి మౌనిక ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేయించారు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సరస్వతీ మాత పూజ నిర్వహించి చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. అక్షరాభ్యాస మహోత్సవంలో సరస్వతీ అమ్మవారి వద్ద పూజ చేయించిన అక్షరాభ్యాసం చేయించిన తల్లిదండ్రులకు తీర్థ ప్రసాదాలు అందించి పలక బలపం తదితర వాటిని చిన్నారులకు అందించారు..

## జ్ఞాన వసంతానికి ప్రతీక వసంత పంచమి

- మహామండలేశ్వర్ సిద్దేశ్వరానంద గిరి
- వైభవంగా వసంత పంచమి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో రాజశ్యామల నవరాత్రులు



**ఝరాసంగం జనవరి 23 సిరి న్యూస్) :** వసంత పంచమి కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా మన జీవితాల్లో జ్ఞాన వసంతాన్ని ఆవిష్కరించే మహత్తర రోజుగా భావించాలని బర్దిపూర్ దత్త గిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి మహామండలేశ్వర్ సిద్దేశ్వరానంద గిరి మహారాజు పేర్కొన్నారు. అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి జ్ఞానం అనే వెలుగును ప్రసాదించేదే ఈ శుభదినమని తెలిపారు. శుక్రవారం వసంత పంచమి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. అలాగే దత్తాత్రేయ మందిర నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వసంత ఋతువు ప్రకృతికి పుష్పాలను ప్రసాదిస్తే, వసంత పంచమి మన జీవితాలకు సద్గుణాలు, సృజనాత్మకతను అందిస్తుందని వివరించారు. కాగా రాజశ్యామల దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల కోసం ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.






## సొంత నిధులతో బస్టాండ్ నిర్మాణం అభినందనీయం

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి




**జిన్నారం జనవరి 23 (సిరి న్యూస్):** గడ్డపోతారం మున్సిపాలిటీలోని లక్ష్మీపతిగూడెం 17వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి, సేవాదృక్పథం కలిగిన నాయకుడు నలగండ్ల అశోక్ కుమార్ తన సొంత నిధులతో నిర్మించిన బస్టాండ్ ను ఈరోజు బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ కన్వీనర్ మద్దూరి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. పదవిలో లేకపోయినా ప్రజల సౌకర్యం కోసం సొంత డబ్బు వెచ్చించి బస్ షెల్టర్ నిర్మించడం గొప్ప విషయమని అశోక్ కుమార్‌ను అభినందించారు. లయన్స్ క్లబ్ ద్వారా అశోక్ కుమార్ గతంలో చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఇలాంటి సేవాభావం ఉన్న నాయకులు ఉంటేనే వార్డు అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాప్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వంగేటి రాజిరెడ్డి జిన్నారం మండల అధ్యక్షులు కొత్తకాపు జగన్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శులు మద్దూరి మాణిక్యం, రమణాసింగ్శక్తి కేంద్రం ఇంచార్జ్ ఎం.పి. బాలయ్య, నాయకులు ఓంకార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు



# డిప్యూటీ తహసీల్దార్ పోస్ట్ ఖాళీ

**ఝరాసంగం జనవరి 23 సిరి న్యూస్) :**ఝరాసంగం తహసీల్దార్ కార్యాలయంలో గత 12 రోజులుగా డిప్యూటీ తహసీల్దార్ పోస్ట్ ఖాళీ ఏర్పడింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కొంత మంది తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు గత రెండు వారాల క్రితం స్థానచలనం జరిగింది. అందులో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్‌రావు డిప్యుటేషన్‌పై హత్నూర మండలానికి బదిలీపై వెళ్ళారు.సంగారెడ్డి డీటీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న మహేష్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఆయన ఇప్పటి వరకు జాయినింగ్ కాలేదు. దీంతో విధ్యార్థులకు అవసరమయ్యే కుల,ఆదాయ,నివాస దృవీకరణ పత్రాలతో పాటు వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని మండల ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి డిప్యూటీ తహసీల్దార్ పోస్ట్‌ను భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.

# ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి



**ఝరాసంగం జనవరి 23 సిరి న్యూస్) :** ప్రభుత్వ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్‌ను ఆహ్వానించకుండా ప్రోటోకాల్‌ను విస్మరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఝరాసంగం సర్పంచ్ వినోదబాల్‌రాజ్ శుక్రవారం ఓ పత్రికా ప్రకటన ద్వార తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 22వ తేదిన మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ అద్వర్యంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రాయితీపై వివిధ వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్‌నైన నన్ను పిలువకుండా ఎలాంటి పదవులు లేని స్థానిక అధికార పార్టీ నాయకులను పిలిచి మమ్మలిని అవమానించారన్నారు. దీని పై మండల వ్యవసాయ అధికారిపై ఉన్నతాధికారులకు పిర్యాదుచేస్తామన్నారు.

శ్రీసరస్వతి శిశు మందిరంలో

# వసంత పంచమి వేడుకలు



**పెద్దశంకరంపేట జనవరి 23 (సిరి న్యూస్) :** పెద్ద శంకరంపేట శ్రీ సరస్వతి శిశుమందిరంలో వసంత పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాదేవి సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు.కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు తొలి అక్షరాలు నేర్చుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, వసంత పంచమి విద్యారంభానికి అత్యంత శుభదినమని, చిన్న వయసులోనే విద్యాభ్యాసానికి పునాది వేయడం ద్వారా మంచి భవిష్యత్ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, పాఠశాల అధ్యక్షుడు గంగాధర్ గుప్త, జైహింద్ రెడ్డి , రవివర్మ, సీతారామరావు దేశ్పాండే, గాండ్ల సంగమేశ్వర్, బండల శ్రావణ్ కుమార్, మదు , విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# కోనాపూర్‌లో సుభాష్ చంద్రబోస్‌కు నివాళి



**రామాయంపేట, ( కోనాపూర్) జనవరి 23 (సిరి న్యూస్) :** రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో శుక్రవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకొని ఆ గ్రామ సర్పంచ్ కిచ్చయ్య గారి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాలోత్ బన్సీ, సెక్రటరీ అశోక్ రెడ్డి, మామిడి సిద్ధరాములు, మహేష్, రవికాంత్, భీమయ్య, దివాకర్ ,నవీన్ ,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు..

# వసంత పంచమి వేడుకలు

**నర్సాపూర్ జనవరి 23 (సిరి న్యూస్) :** సరస్వతీ మాత జన్మదినము వసంత పంచమి సందర్భంగా శుక్రవారం విష్ణు ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు వేద బ్రాహ్మణుల సమక్షంలో సర్వస్వతీ మాత పూజ కార్యక్రమం జరిగింది. అనంతరం పాఠశాలలో నూతన ప్రవేశం కల్పిస్తూ విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో అక్షరభ్యాసం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి, ఉప ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ ఏ.ఓ సురేష్ పాల్గొన్నారు




# కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు బబ్లూ





**అందోల్ జనవరి 23 (సిరి న్యూస్) :** ఆందోల్ జోగిపేట మున్సిపల్ 7వ వార్డు బిఆర్ఎస్ మైనారిటీ నాయకుడు బబ్లూ మాజీ కౌన్సిలర్ తోట్ల రామకృష్ణ ఆధ్వర్యములో శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బబ్లూ కు మాజీ కౌన్సిలర్ రాచకొండ ప్రదీప్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించాడు. ఈ సందర్భముగా మాజీ కౌన్సిలర్ రాచకొండ ప్రదీప్ గౌడ్ మాట్లాడుతూ మంత్రి వర్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడు అయినా బబ్లూ పార్టీలో చేరడం సంతోషం కలిగించింది అన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన బిఆర్ఎస్ మైనారిటీ నాయకుడు బబ్లూ మాట్లాడుతూ గత 15సంవత్సరాల నుండి బిఆర్ఎస్ పార్టీకి ఎంతో సేవచేశాను కానీ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నాకు అన్యాయం చేశారు అన్నారు. 2019 మున్సిపాల్ ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి పూర్తిగా సహకరించి గెలిపించుకున్నాము కానీ పార్టీ కానీ మాజీ ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు నాకు ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ ఇస్తాను అని మాటిచ్చి ఇప్పుడు మాటతప్పారు. మంత్రి దామోదర్ చేస్తున్న అభివృద్ధి పనులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తాను అన్నారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ సురేందర్ గౌడ్,రంగ సురేష్,ఆకుల చిట్టిబాబు, డాకూరి శంకర్,పట్లోల్ల ప్రవీణ్,ప్రదీప్ గౌడ్, తోట్ల రామకృష్ణ, నాయకులు కోషికే రాజశేఖర్, గుర్రపు కృష్ణ,ఆకుల నందు,మైనారిటీ నాయకులు గోహెర్ అలీ, యూసుఫ్, సంతోష్, శివ, యాదగిరి, అరుణ్, చిన్న, పాల్గొన్నారు

# మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు





**రామాయంపేట ,జనవరి 23 (సిరి న్యూస్) :** మెదక్ శాసనసభ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేట పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్ రావు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని, మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే రోహిత్ రావు తెలిపారు. కార్యక్రమంలో తాహసిల్దార్ రజనీకుమారి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గౌసు మోయిను ద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, గజవాడ నాగరాజు, చింతల స్వామి, దేమేయాదగిరి, రమేష్ రెడ్డి, పిట్ల ప్రకాష్ ,పోచమ్మల అశ్విని శ్రీనివాస్ ,సర్పంచులు రామకృష్ణయ్య వెంకట్రాంరెడ్డి, బండారు శ్రీనివాస్ గౌడ్, బక్కయ్య గారి యాదగిరి, మద్దూరి సునీల్, నాయకులు నాగులు ,రాజేందర్ గుప్తా ,సంజీవరెడ్డి ,యాదగిరి ,రమేష్ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గ్రూపు రాజకీయాలకు బీఆర్ఎస్‌లో స్థానం ఉండదు

- బీఆర్ఎస్ తూప్రాన్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి వేణుగోపాల్ రెడ్డి సీరియస్
- బీఆర్ఎస్ కష్టకాలంలో పార్టీని నమ్ముకుని ఉన్నవారికి ప్రాధాన్యత



**తూప్రాన్ జనవరి 23 సిరి న్యూస్) :** తూప్రాన్ మున్సిపల్ పరిధిలో ఎలక్షన్లలకు సంబంధించి చైర్మన్ స్థానం మహిళకు రిజర్వేషన్ రావడంతో నాయకులలో అయోమయ పరిస్థితి నెలకొంది జనరల్ స్థానాలలో కూడా బడా నాయకులు తమ సతీమణులకే ప్రాధాన్యత ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది శుక్రవారం తూప్రాన్ మున్సిపల్ ఇంచార్జ్ వేణుగోపాల్ రెడ్డి 16 వార్డులలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు బిఆర్ఎస్ పార్టీ తరపున మున్సిపల్ ఎన్నికల బరిలో పోటీ చేసే అభ్యర్థుల సర్వేల ప్రకారం బీఫామ్ ఇవ్వడానికి అన్ని విధాల అభ్యర్థుల పనితీరును ప్రజల్లో ఉన్న ఆదరణ అభిప్రాయాలను సేకరిస్తున్నామని బిఆర్ఎస్ నుండి అభ్యర్థి ఒకరే నిల్చోవాలని పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఇండిపెండెంట్ గా చేస్తాము అన్నవారిపట్ల సీరియస్ గా యాక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని పార్టీకి కట్టుబడి పనిచేసిన వారికే రాబోయే రోజుల్లో నామినేటెడ్ పోస్టులు కానీ పార్టీలో ఉండే పరిస్థితులు ఉంటాయని పార్టీ నిబంధనలను వ్యతిరేకించి ఇండిపెండెంట్ గా పోటీ చేస్తామని అభ్యర్థులను భయపట్టించడం బ్లాక్మెయిల్ చేయడం అటువంటివి మానుకోవాలని పార్టీ కోసమే కష్టపడి పార్టీని ముందుకు నడిపించే వారే పార్టీకి అవసరమని వారి ఇష్టానుసారం నడుచుకునే వారి పట్ల బిఆర్ఎస్ పార్టీలో స్థానం ఉండదని గ్రూప్ రాజకీయాలు ఇక్కనుండి నడవనీయమని పార్టీ అధిష్టాన నాయకుల సలహాలు సూచనల మేరకు నడుచుకొనే వారే పార్టీకి అవసరమని ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి సేవ చేసే వారికి ముందు పార్టీలో స్థానం ఉంటుందని పార్టీ ఫిరాయింపుల వలన నష్టం ఎవరికో గమనించాలని రాబోయే రోజుల్లో పార్టీని నమ్ముకుని ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఇన్చార్జ్ వేణుగోపాల్ రెడ్డి స్పష్టంగా చెప్పారు 11వ వార్డు కౌన్సిలర్ అరుణ వెంకట్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం పార్టీ అధికారంలో లేకపోయినా ప్రజల్లో మాత్రం కారు సార్ కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు ప్రజల్లో ఇంకా బలంగా ఉన్నాయని రైతుబంధు రైతుబీమా రైతన్నలకు సమయానికి యూరియా బస్తాలు ఇంటింటికి తాగునీరు నల్లాలు కెసిఆర్ కిట్టు కళ్యాణ లక్ష్మి ఇచ్చిన ఘనత కేసిఆర్ దేనని స్థానికంగా జరిగిన సర్పంచ్ ఎలక్షన్లలో ఏడు గ్రామ సర్పంచులను గెలిచామని అదేవిధంగా మున్సిపాలిటీలో మెజార్టీ కౌన్సిలర్స్ ను గెలవడం ఖాయం హరీష్ అన్న ఆశీస్సులు ప్రజల దీవెనలతో తూప్రాన్ మున్సిపల్ కైవసం చేసుకుంటామని తెలిపారు కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు 11వ వార్డులో నలుగురు అభ్యర్థుల పేర్లను ఇవ్వడం జరిగింది సర్వే అనంతరం ఒకరి పేరు నిర్ణయం చేసి బీఫామ్ ఇస్తారని తెలిపారు.

# మాహాత్మగాంధీ పేరును తొలగిస్తే బీజేపీని బొంద పెడతాం



**నర్సాపూర్ జనవరి 23 (సిరి న్యూస్) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించాలని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కుట్రచేస్తుందని శుక్రవారం నర్సాపూర్ పట్టణంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆరోపించారు.ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని తొలగించి వీబీజీ రాంజీ చట్టాన్ని తీసుకురావాలని కుట్ర చేస్తున్నారని ఈ చట్టం వెంటనే రద్దు చేయకుంటే కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని కార్పొరేట్ పెట్టుబడుదారులైన ఆదాని, అంబానీలకు కేంద్రం లక్షల కోట్లు కట్టపెడుతుంది కాశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు రాబోయే ఎన్నికల్లో బీజేపీని బొందపెట్టి రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తాము ఉపాధి హామీ పథకాన్ని తొలగిస్తే ఊరుకోమని వెంటనే ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు జనవరి 26 తేదీన ప్రతి గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం సీనియర్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు

# విద్యార్థులకు, యువతకు దేశభక్తి నేతాజీ చరిత్ర అవసరం

- మై భారత్ మై నవభారత్ నేతాజీ దినోత్సవ కార్యక్రమం
- యువజ్యోతి స్పోర్ట్స్ అండ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఫుట్బాల్ పోటీలు




**రామాయంపేట, జనవరి 23 (సిరి న్యూస్) :** భారతదేశ స్వతంత్ర పోరాటంలో ఎందరో విప్లవ రచయితలు ప్రాణాలు త్యాగం చేశారని అటువంటి త్యాగదనుల చరిత్ర విద్యార్థులకు, యువజనులకు ఎంతైనా అవసరమని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయలు తెలిపారు. ప్రభుత్వబాలుర పాఠశాల మైదానంలో శుక్రవారం మై భారత్ క్రీడలు మరియు యువజన సర్వీసుల మంత్రుల శాఖ ఏర్పాటు చేసిన ప్రముఖ స్వతంత్ర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన క్రీడలు మరియు నివాళి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర చరిత్రలో సుభాష్ చంద్రబోస్ ఒక లెజెండ్ స్వాతంత్ర యోధుడని అన్నారు .ఆయన పోరాటం మరువలేనిది అన్నారు సిద్ధాంతంతో ముందుకు వెళితే నేతాజీ మాత్రం ఓడించి తరిమికొట్టాలని సాయుధ పోరాటాన్ని చేశారని అన్నారు పాఠశాల ఉపాధ్యాయుడు ఆశయ్య మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటం బ్రిటిష్ వారిని దేశం నుండి తరిమికొట్టారన్నారు ఆయన పౌరుషం పోరాట స్ఫూర్తి విద్యార్థుల్లో ఉండాలని ఆయన కోరారు కార్యక్రమం నిర్వాహకుడు యువ జ్యోతి స్పోర్ట్స్ అండ్ యూత్ కోఆర్డినేటర్ సత్యనారాయణ ఉపాధ్యాయురాలు నాగ లక్ష్మి హేమలత యువజ్యోతి ఫుట్బాల్ క్రీడాకారులు పాఠశాల హాస్టల్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథరావు వర్ధంతి



**నర్సాపూర్ జనవరి 23 (సిరి న్యూస్) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి,బీసీ నాయకుడు ముదిరాజ్ నర్సాపూర్ మాజీ శాసనసభ్యులు స్వర్గీయ చౌటి జగన్నాథరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జగన్నాథరావు కుమారుడు చౌటి శ్రీనివాస్ తో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నర్సాపూర్ పట్టణంకు చెందిన జగన్నాథరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉపముఖ్యమంత్రి చేయడం గర్వకారణం అని అన్నారు.. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'ఓటు' ఒక వజ్రాయుధం

- 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును విని యోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జనవరి 23(సిరిన్యూస్) :** ప్రతి పౌరుడు ఓటు హక్కును కలిగి ఉండాలని ఓటే ఒక వజ్రయుధంలా వాడుకుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.జాతీయ ఓటరు దినోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మెదక్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు జిల్లా అధికారులు కలెక్టరేట్ అన్ని విభాగాల ఉద్యోగులతో కలిసి ఆయన ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16వ జాతీయ ఓటరు దినోత్సవంలో "నా భారత్ - నా ఓటు" అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 25వ తారీఖున ఓటర్ నమోదుపై ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు., నూతనంగా నమోదు కాబడిన ఓటర్లను గుర్తించి వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందించడం జరుగుతుందని, ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని, సంబంధిత ఫోటోలు, వీడియోలను ఆయా శాఖల సోషల్ మీడియా ఖాతాలలో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.ఓటరు ప్రతిజ్ఞ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఓటరు నమోదు ప్రతిజ్ఞ చేశారు.భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల పవిత్రతను నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగిస్తామని ఇందు మూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి

**వెల్దుర్తి జనవరి 23, (సిరి న్యూస్) :** భారతదేశ స్వతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారిపై అలుపెరుగని పోరాట పటిమను కనబరచిన వీరుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మెల్లూరు గ్రామ సర్పంచ్ రంగారెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన విగ్రహన్ని కి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలు జ్ఞాపకం చేసుకుంటూ వారిని కొనియాడారు. బాబు గౌడ్, సుంకం నెల్లూరు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎస్సై



**నిజాంపేట జనవరి 23 సిరి న్యూస్) :**నార్లపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గతంలో గుర్తుతెలియని దుండగుల చేతిలో సరస్వతి విగ్రహం ధ్వంసం కాగా ఆట్టిస్థానంలో గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసి విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా నిజాంపేట ఎస్సై రాజేష్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నీలం సంజీవ్,ఫ్రెండ్స్ క్లబ్ మెంబర్స్ బాలరాజు, వెంకటేష్ కిరణ్, స్వామి ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతల నివాళి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్




**శివంపేట్ జనవరి 23 ( సిరి న్యూస్) :** రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే క్రీస్తు శేషులు చౌటి జగన్నాథ్ రావు వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పంచాయతీరాజ్, హోం శాఖ మంత్రిగా పదవులు ఆశించాడని గుర్తు చేశారు. అధికారాన్ని కాదు అభివృద్ధిని నమ్ముకున్న మహానేత అని అన్నారు. బీసీ వర్గాలకు స్వరం ఇచ్చిన ధైర్యం, బడుగు బలహీన వర్గాలకు భరోసాఇచ్చిన హృదయం అతడు. నర్సాపూర్ నియోజకవర్గానికి అభివృద్ధి దిశ చూపిన మహా నేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బగలాముఖి శక్తిపీఠంలో అక్షరాభ్యాసం



**శివంపేట్ జనవరి 23 ( సిరి న్యూస్) :** శివంపేట మండల కేంద్రంలోని బగలాముఖి శక్తిపీఠం ఆలయంలో శుక్రవారం రోజున అంగన్వాడీ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన అక్షరాబ్యాసం కార్యక్రమనికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ హాజరై అంగన్వాడి పిల్లలతో అక్షరబ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శేరిపల్లి నరేష్, మియ్యాడి ముత్యాలు, కోవూరి యాదగిరి, రెడ్డిపల్లి అశోక్, మాజీ ఉపసర్పంచ్ బసంపల్లి రామగౌడ్, మాజీవార్డు సభ్యులు వంజరి కొండల్,మియ్యాడి సింహం,మరియు జోగాని నవీన్,అంగన్వాడీ సూపర్ వైజర్ సంతోష టీచర్ నవీన,మరియు పబ్బ మహేష్ గుప్తా యువసేన సభ్యులు, బగలాముఖి శక్తిపీఠం భక్తులు తదితరులు అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇన్స్పైర్ లో మెరిసిన విద్యార్థులు



**మెదక్ జనవరి 23(సిరిన్యూస్) :** దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మెదక్ జిల్లా కు మూడు బహుమతులు రావడం అత్యంత సంతోషాకరం అని జిల్లా విద్యాధికారినీ విజయ పేర్కొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19 నుండి 23 వరకు సంగారెడ్డి జిల్లాలోని కొల్లూర్ గాడియమ్ స్కూల్లో నిర్వహించిన దక్షిణ భారతస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుండి పాల్గొనిన టీచర్ ఎగ్జిబిట్ లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొడపాక భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు వెంకట రమణ మొదటి స్థానం పొందడం జరిగిందని, గీత స్కూల్ తూప్రాన్ విద్యార్థిని మహతి మూడవ స్థానం, సిద్ధార్థ రూరల్ హై స్కూల్ విద్యార్థి అక్షయ్ నాలుగో స్థానం లో నిలవగా రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ రమేష్ గారి చేతుల మీదుగా బహుమతులను పొందడం గర్వించదగ్గ విషయంగా కొనియాడారు. విజేతలను కలెక్టర్ రాహుల్ రాజ్ అదనపు కలెక్టర్ నగేష్ అభినందించారని తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డీటీడీవో నీలిమ



**కౌడిపల్లి జనవరి 23 ( సిరి న్యూస్ ) :** మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం డిటిడిఓ నీలిమ సందర్శించారు సందర్శనలో భాగంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు అనంతరం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ జయరాజ్ ఉపాధ్యాయులు దుర్గయ్య, రాజేశ్వరి ,మంజుల సత్య గౌడ్, పిఈటి పానీల్ కుమార్ ,ఏఎన్ఎం వెన్నెల పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



## రంగాయిపల్లి పాఠశాలలో వసంత పంచమి వేడుకలు

**మనోహరాబాద్, జనవరి 23. సిరి న్యూస్) :** వసంత పంచమి నీ పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని రంగాయపల్లి ఉన్నత పాఠశాలలో భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం మురళీ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో స్థానిక సర్పంచ్ భాగ్యలక్ష్మి యాదగిరి పాల్గొని టీచర్లు, బాలికలతో కలిసి సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు.

## వసంత పంచమి వేడుకలు



**తూప్రాన్ జనవరి 23 సిరి న్యూస్) :** తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలోని అంగన్వాడి సెంటర్ లో వసంత పంచమిని పురస్కరించుకొని చిన్నారులకు అక్షరాభ్యాసం అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు అంగన్వాడి టీచర్లు ఇస్లాంపూర్ గ్రామ సర్పంచ్ గొల్లపల్లి సంతోష్ రెడ్డిని సన్మానించారు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాని అంగన్వాడి సెంటర్ లో పౌష్టిక ఆహార విలువల గురించి గర్భిణీలకు చిన్నారులకు తెలియజేశారు చిన్నారుల తోపాటు గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు అంగన్వాడి టీచర్ల తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు గ్రామ పెద్దలు మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

## యాచకుడి మృతి



**తూప్రాన్ జనవరి 23 సిరి న్యూస్) :** తూప్రాన్ మున్సిపల్ పరిధిలో కొద్దీ రోజుల నుండి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి వయసు సుమారు 45 సంవత్సరాలు గురువారం రోజు రాత్రి పడుకున్న ప్రదేశంలోనే మృతి చెందినట్లు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు అతని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చరి లో భద్రపరచామని అతన్నికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని ఎస్ఐ గంగరాజు తెలిపారు..

## సిరి దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రముఖ సంఘ సేవకులు

- తాజా మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా




**శివంపేట్ జనవరి 23 ( సిరి న్యూస్) :** శివంపేట మండల ఆపద్బాంధవుడు, సంఘ సేవకులు తాజా మాజీ జడ్పిటిసి పబ్బా మహేష్ గుప్త. శుక్రవారం సిరి దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించారు. గ్రామాలలో నిత్యం పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వార్తల రూపంలో ప్రచురిస్తూ పీడిత ప్రజల గొంతుకగా సిరి దిన పత్రిక నిలుస్తుందని,శివంపేటలోఆయనకార్యాలయంలో శివ్వంపేట సిరి రిపోర్టర్ బాలు నాయక్ తో కలిసి సిరి దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పబ్బ మహేష్ గుప్త మాట్లాడుతూప్రతి నిత్యం పీడిత ప్రజల పక్షాన ప్రత్యేక కథనాలు రాస్తూ సిరిదిన పత్రిక కు తనవంతు కృషిగా సమాజంలో ప్రజల పక్షాన క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తూనే, నిజాలను నిర్భయంగా రాస్తూ, పేదల కష్టాలను కళ్లకు కట్టినట్టు వార్తలు రాస్తూ, అధికారులు అందిస్తున్న సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో సిరి దినపత్రిక ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాబోయే రోజులలో కూడ సిరి దినపత్రికలో ప్రజా అవసరాలపై మరిన్ని కథనాలు రాస్తూ ప్రజలను చైతన్యం చేస్తూ, ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా సిరిముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివంపేట గ్రామ సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఈసు గారి మల్లేష్ మాజీ ఉప సర్పంచ్ బాసంపల్లి రామా గౌడ్ , గ్రామ తెరాస అధ్యక్షులు ముదగల లక్ష్మీ నరసయ్య , వార్డు సభ్యులు ఎస్,నరేష్. కోవూరీ యాదగిరి, మెయ్యడి ముత్యాలు,మాజీ వార్డు సభ్యులు సింహం, కోవూరి వెంకటేశం, పబ్బ మహేష్ గుప్తా యువసేన సభ్యులు దొడ్డి అశోక్, బిస్కుంది ఆంజనేయులు, రాజి పేట నాగేష్ తదితరులు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి



**తూప్రాన్ జనవరి 23 సిరి న్యూస్) :** తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల కార్యకర్తల సన్నాహక సమావేశంలో శుక్రవారం రోజు పాల్గొన్న మంత్రి వివేక్ వెంకట స్వామి కాంగ్రెస్ పాలన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతు గజ్వేల్ నియోజకవర్గం లోకాంగ్రెస్ వంద సర్పంచ్ సీట్లు గెలుచుకున్నాం అని బిఆర్ఎస్ ప్రభుత్వం లో కేటీఆర్ మున్సిపల్ అభివృద్ధి కోసం 25 కోట్లు మంజూరు చేస్తు హామీ ఇచ్చారు కానీ అమలు చేయలేదని అన్నారు కాంగ్రెసు రెండు సంవత్సరాలకు పరిపాలన కాలంలో ఒక మున్సిపాలిటీకి 15 కోట్లు మంజూరు చేసింది అని తూప్రాన్ లో పనులు కూడా ప్రారంభం అయ్యాయి అని అన్నారు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 50 వేల ఉపాధ్యాయుల పోస్టు లు ఇచ్చిందని రెండు సంవత్సరాల వ్యవధిలో నేకాంగ్రెస్ ప్రభుత్వం లక్ష ఉద్యోగాలు కేటాయించిందిఅని వచ్చే నెలలో వితంతు దివ్యంగులకు వృద్ధుల కు నూతన పెన్షన్ ఇచ్చే అవకాశం ఉందన్నారు 12 సంవత్సరాల పాలనలో కెసిఆర్ ఒక్కసారి మాత్రమే తూప్రాన్ కు రావడం జరిగింది అని బి ఆర్ ఎస్ నాయకులు ఓట్లు అడిగితే ప్రశ్నించాలని అన్నారు గజ్వేల్ లో ఎమ్మెల్యే ప్రజల మధ్యకు రావడం లేదుఅని అలంటి నాయకుడు అవసరమా అని అన్నారు గజ్వేల్ తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ పీఠాని కాంగ్రెస్ కైవసం చేసుకుంటే రాబోయే ఎన్నికల లో నర్సారెడ్డి విజయం తథ్యం అని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు ఈ కార్యక్రమం లోగజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూమిరెడ్డి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు




## స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

**వెల్దుర్తి, జనవరి 23, (సిరి న్యూస్) :** వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం వెల్దుర్తి గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ, విద్యార్థి దశలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవాభావం, సాహసోపేత దృక్పథం వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, బృంద సహకారం నేర్చుకుంటారని, సమాజ సేవకు ప్రేరణ పొందుతారని వివరించారు.అనంతరం సర్పంచ్ ఆదర్శ్ మాట్లాడుతూ, ఈ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమం పాఠశాలకు రావడానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు సాంబయ్యతో పాటు ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, ఖదీర్, అర్చన, అమూల్య, విజయ్ మోహన్, శైలజ, శ్రీనివాస్ రావు, నవనీత, రాధిక, సునీత, వాణి శ్రీ, పద్మజ, రాము, వెంకట్ రెడ్డి, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధచూపాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమ జాతి

**రామాయంపేట, జనవరి 23. (సిరిన్యూస్) :** పిల్లల చదువుపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి చెప్పారు .శుక్రవారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు పిల్లలను కళాశాలకు పంపించాలని చెప్పారు. విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను కళాశాలలో కల్పించడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యా బోధన చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇంటి వద్ద సెల్ఫోన్ చూడకుండా చదువుకునే విధంగా తగు చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంటర్మీడియట్ దశ ఒక కీలకమని ఆమె తెలిపారు. ప్రస్తుతం పిల్లల పట్ల తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తే వారి జీవితాలు అంధకారంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధతో చదువుకునే విధంగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. కళాశాలలో చదివి ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# సిట్ విచారణ ఒక నాటకం

- కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు
- హామీలు అమలు చేతకాక రోజుకో బూటకం

**కౌడిపల్లి జనవరి 23 ( సిరి న్యూస్ ):** కెసిఆర్ కుటుంబం పై కావాలని రేవంత్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడు తుందని సిట్ విచారణతో రోజుకు ఒక నాటకం ఆడుతుందని పాలన చేతకాక సిట్ విచారణ పేరుతో కాలయాపన చేస్తుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సార రామా గౌడ్ మండిపడ్డారు శుక్రవారం మాజీ మంత్రి కేటీఆర్ సిట్ విచారణకు హాజరు సందర్భంగా కేటీఆర్ కు మద్దతుగా కౌడిపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సార రామ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు హైదరాబాద్ తెలంగాణ భవన్ కు తరలి వెళ్లారు కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేతకాక కెసిఆర్ కుటుంబం పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసే సోయి లేక ప్రజలను పక్కదారి పట్టించేందుకు రోజుకు కొత్త నాటకం రేవంత్ రెడ్డికి తీసుకు వస్తున్నాడని దుయ్యబట్టారు. హరీష్ రావు బొగ్గు కుంభకోణం లేవనెత్తినందుకే హరీష్ రావు, కేటీఆర్ ల పై సిట్ విచారణ జరిపిస్తున్నారని అన్నారు. సంబంధం లేని కేసులో కెసిఆర్ కుటుంబాన్ని లాగడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కి దమ్ముంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందు ఉంచాలి గాని రాజకీయ కక్షలో కాదని అన్నారు. కాలయాపన మానుకొని ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముంచాలని ఆయన



హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజు నాయక్ బీఆర్ఎస్ నాయకులు బాన్సువాడ మహిపాల్ రెడ్డి, సర్పంచ్ రవి యాదవ్, ధన్ రాజ్ ,మనోహర్ రెడ్డి ,మహమూద్ పాష ,గణేష్ గౌడ్ ,మల్లేశం ,యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే భవిష్యత్

- జిల్లా విద్యాధికారి విజయ
- పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి
- ఒక విద్యార్థి గైర్హాజర్
- విద్యార్థి ఇంటికెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడిన విజయ
- జిల్లా విద్యాధికారి చొరవతో పాఠశాలకు చేరుకున్న విద్యార్థి

**కొల్చారం డిసెంబర్( 23 సిరి న్యూస్) :** మండల కేంద్రమైన కస్తూరిబా విద్యాలయం చెందిన విద్యార్థిని పదవ తరగతి చదువుతుండగా శుక్రవారం విద్యాధికారి శ్ విజయ కేజీబీవీ కొల్చారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థిని ఒకరు పాఠశాలకు హాజరు కాకపోవడం గమనించి, ఆమె గైర్హాజరు కారణాలను తెలుసుకున్నారు. అనంతరం కొడపాక గ్రామం, పాపన్నపేట మండలంలో ఉన్న ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లి, ఆమె



తల్లిదండ్రులతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున హాస్టల్ కి త్వరగా పంపించి పరీక్షలకు సన్నద్ధం కావలసిందిగా తెలియజేసి తిరిగి కేజీబీవీ కొల్చారం హాస్టల్ కి



విద్యార్థిని తిరిగి పాఠశాలకు తీసుకురావడం జరిగింది.. ఏ ఎస్ ఓ నవీన్ గారు ఉన్నారు.

# కొల్చారంలో బెల్ట్ షాపులు తొలగించాలి



**కొల్చారం డిసెంబర్ 23 (సిరి న్యూస్) :** మండల కేంద్రమైన కొల్చారంలో పదుల సంఖ్యలో బెల్ట్ షాపులు ఉండడంతో యువత గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడి చెడు వ్యసనాలకు గురవుతున్న నేపథ్యంలో బెల్ట్ షాపులు మూసివేయాలన్నా నిర్ణయం వార్డు సభ్యులు సర్పంచిగా తాను ఈనెల 26 నుండి బెల్ట్ షాపులు బంద్ వేయాలని తీర్మానం చేసినట్లు ఈ సందర్భంగా కొందరు వైన్ షాపులతో కుమ్మక్కై ఈ తీర్మానం రద్దు చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు వాడడంతో సర్పంచ్ దేవన్న గారి శేఖర్ ను వివరణ కోరగా ఎట్టి పరిస్థితుల్లో గ్రామ ప్రజల ప్రయోజనం కోసం బెల్ట్ షాపుల రద్దు కొనసాగనివ్వమని వైన్ షాప్ 10:30కు ఇస్తారని కొల్చారంలోని బెల్ట్ షాపులు ఎప్పుడంటే అప్పుడు తీసి ఆర్థికంగా గ్రామ ప్రజలకు మహిళలకు ఇబ్బందుల పాలు అవుతున్న నేపథ్యంలో ఇటువంటి నిర్ణయం తీసుకున్నట్లు సిరి తో అన్నారు..



## రామాయంపేటలో ఎమ్మెల్యే పర్యటన

- కంటి ఆస్పత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు

**రామాయంపేట, జనవరి 23 (సిరి న్యూస్) :**రామాయంపేట పట్టణంలో శుక్రవారం నాడు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావ్ పర్యటించారు . పట్టణములో నూతనంగా ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరి కంటి ఆసుపత్రినీ మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి వైద్యం అందించాలన్నారు. కంటి చూపుతో బాధపడుతున్న వారికి హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక అవసరాలు అనుగుణంగా రామా యంపేటలో కంటి ఆస్పత్రిని ప్రారంభించడం పట్ల ఆయన నిర్వాహకుడు డాక్టర్ ప్రదీప్ రావు ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వర కంటి ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, రామయంపేట పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థులతో ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ

**నార్సింగి, జనవరి 23 (సిరి న్యూస్):** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో, మండలం లోని అన్ని పంచాయతీలలో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గ్రేస్ బాయి ఆధ్వర్యంలో విద్యార్థులతో ఓటర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఓటు హక్కు పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గ్రేస్ బాయి, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పిస్తూ ఓటు వేయడం ప్రతి పౌరుని భాధ్యత అని, ప్రజా స్వామ్యం లో ఓటు ఎంతో విలువైనదని అన్నారు. ఓటు వజ్రాయుధం అని, ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని సరైన విధంగా ఓటు హక్కు ను వినియోగించుకోవాలని అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా, డబ్బులకు ప్రలోభ పడకుండా, కుల, మత, భాషా పరమైన ప్రభావానికి లోను కాకుండా నిర్భయంగా ఎన్నికలలో ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వంగా ప్రీతీ





రెడ్డి, ఆర్ ఐ శ్రీధర్, మేఘన, ఎమ్.ఎన్.ఓ రామకృష్ణా, పాఠశాల ఉపాధ్యాయులు పూర్ణ చంద్రరావు, స్వామి పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, రెవెన్యూ, పంచాయితీ రాజ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శిరస్త్రాణమే శ్రీరామరక్ష

- రోడ్డు భద్రత నియమాలు పాటించండి సురక్షితంగా గమ్యం చేరండి
- అతివేగం ప్రమాదకరం, హెల్మెంట్ వాడకం మన ప్రాణాల్ని కాపాడుతుంది
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు
- ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే





**మెదక్ జనవరి 23(సిరిన్యూస్) :**రోడ్డు ప్రమాదాల నివారణకై శిరస్త్రానమే వాహనదారులకు శ్రీరామరక్ష అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయం నుండి ఆటోనగర్, రాందాస్ చౌరస్తా వరకు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతపై యువతకు అవగాహన కలిగించే విధంగా అతివేగం ప్రమాదకరం హెల్మెట్ దారుణ మన ప్రాణాల్ని రక్షిస్తుందన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం సురక్షితంగా గమ్యాన్ని చేరదాం అనే అనే నినాదాలతో పురవీధులు మారుమోగాయి. రాందాస్ చౌరస్తా ఏరియాలో రోడ్డు భద్రత నియమాలపై. ప్రతిజ్ఞ నిహించారు. అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్ మాట్లాడుతూ యువత వేగాన్ని నియంత్రించుకోవాలని మనిషి జీవితం చాలా విలువైందని అందులో ప్రాణం విలువ వెల కట్టలేనిదన్నారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ ద్విచక్ర వాహనదారులే ఉన్నారని. వారు నిబంధనలు పాటించకుండా.ప్రయాణం చేయడం వల్ల విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం రవాణా శాఖ ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు సలహాలు ద్వారా ప్రమాదాలు కాస్త తగ్గుముఖం పట్టాయని చెప్పారు. అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణ దగ్గర.ద్విచక్ర వాహనదారులకు ఎమ్మెల్యే హెల్మెట్లు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు కి హెల్మెట్ తప్పనిసరి అని అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగులు తోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ద్విచక్ర వాహన ఉన్న ఉద్యోగులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నిబంధనలు తీసుకురావడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై. ప్రజలు అవగాహన పెంపొందించుకుని వారి నిండు జీవితాన్ని ప్రమాదాల బారిన పడకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్ ,అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, రవాణా శాఖ అధికారి వెంకటస్వామి. సంబంధిత పోలీస్, యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా బోధన

- చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం





**రామాయంపేట, (కల్వకుంట) జనవరి 23 (సిరిన్యూస్) :** ప్రభుత్వ బడులలో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన ఉంటుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కాంగ్రెస్ నాయకుడు,ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పర్సనల్ కార్యదర్శి రంగా రాజాకిషన్ అన్నారు. మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో గురువారం రోజున వసంత పంచమిని పురస్కరించుకొని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న విద్యార్థులకు పలకలు, నోట్ బుక్స్ అందజేసి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి మాత విగ్రహానికి పూలతో అలంకరించి పూజల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రతి ఒక్కరు ప్రభుత్వ బడుల్లో చేర్పించి పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి, బ్యాగరి రాజేష్ బొజ్జ భాస్కర్ గౌడ్, రంగ శేఖర్, రంగ కృష్ణ తదితరులు ఉన్నారు.